ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రిజర్వేషన్ల దామాషాపై ప్రజాభిప్రాయ సేకరణ

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



వికారాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బీసీ కుల సంఘాలు, ప్రజాప్రతినిధులు, ఇతర కుల సంఘాలు, పార్టీల నుంచి, ప్రజల నుంచి అభ్యర్థనలు సలహాలు ఆక్షేపణలను నవంబర్ 13(బుధవారం) ఉదయం 10.30 గంటలకు రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్ భుసాని వెంకటేశ్వర్ రావు, బి. సైదులు ప్రజాభిప్రాయ సేకరణ జరపనున్నారని తెలిపారు. ఆయా కులాల స్థితిగతులపై డెడికేటెడ్ కమిషన్‌కు వ్యక్తులు, నమోదిత, నమోదు కాని సంఘాల నుంచి వారి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, సాక్ష్యాలను, సంబంధిత విషయాలను పేర్కొనాలన్నారు. స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాశాను పేర్కొనే విషయంలో ఏవైనా అభ్యంతరాలు, సలహాలు, సూచనలుంటే కమిషన్ ఎదుట హాజరై తెలియజేయాలని తెలిపారు.



గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, పక్కన శాసనమండలి ఛైర్మన్ గుత్తా, తదితరులు

జపాన్‌లో గాంధీజీకి స్పీకర్ నివాళి

వికారాబాద్, నవంబర్12 (ఆంధ్రజ్యోతి): జపాన్ పర్యటనలో భాగంగా మంగళవారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ టోక్యోలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్, సెక్రటరీ నరసింహాచార్యులు ఉన్నారు.



తాండూరు మున్సిపల్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న అధికారులు, సిబ్బంది

నిరసన జ్వాల

లగచర్ల ఘటనపై భగ్గుమన్న ఉద్యోగ లోకం

ఫార్మా కారిడార్ ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణకు దుద్యాల మండలం లగచర్లకు వెళ్లిన కలెక్టర్ ప్రతీక్‌జైన్, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌లపై దాడిని నిరసిస్తూ మంగళవారం ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పలుచోట్ల ఉద్యోగులు విధులు బహిష్కరించారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, ఈ ఘటనకు పాల్పడిన వారిపైన, వారిని పురికొల్పిన వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులపై దాడిని ముక్తకంఠంతో ఖండించారు. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేశారు.

- నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళనలు
- కార్యాలయాలకు తాళం వేసి విధుల బహిష్కరణ
- అధికారులకు భద్రత కల్పించాలని డిమాండ్
- నిందితులపై కఠిన చర్యలకు పట్టు



మేడ్చల్ కలెక్టరేట్ వద్ద నిరసనలో అదనపు కలెక్టర్, అధికారులు

తాండూరు/పెద్దేముల్/బషీరాబాద్/మహేశ్వరం/పరిగి/ఇబ్రహీంపట్నం/మేడ్చల్ ప్రతినిధి/యాలాల/ పూడూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉద్యోగులకు కౌన్సిలర్ ప్రభాకర్‌గౌడ్ మద్దతిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, టీఎంసీ రాజేంద్ర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. పెద్దేముల్ మండలపరిషత్ కార్యాలయంలో సిబ్బంది భోజన విరామంలో నిరసన తెలిపారు. ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు,

మిగతా 7వ పేజీలో...



మాట్లాడుతున్న రాజేష్‌నాయక్

ఫార్మా కారిడార్ ఏర్పాటును ఉపసంహరించుకోవాలి

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్

పరిగి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలంలో ఫార్మా కారిడార్ పేరిట గిరిజనుల భూములను లాక్కోవడాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఉపసంహరించుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్టీ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కో-ఆర్డినేటర్ రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం పరిగిలో మాట్లాడుతూ ఫార్మా కంపెనీ పేరుతో అమాయక రైతుల భూములను గ్రామసభ పేరుతో ప్రభుత్వ యంత్రాంగాన్ని తండాకు పంపించి భయభ్రాంతులకు గురిచేసి, ఆపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని సూచించారు. ఫార్మా కారిడార్‌ల ఏర్పాటుకు లంబాడీల భూములే దొరికాయా? అని ప్రశ్నించారు. గిరిజన భూములను లాక్కోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం ఫార్మాకంపెనీ ఏర్పాటును ఉపసంహరించుకోవాలని, లేదంటే తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

బషీరాబాద్ ఇన్‌చార్జి ఎంపీవోగా జయకార్



బషీరాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ ఇన్‌చార్జి ఎంపీవో(మండల పంచాయతీ అధికారి)గా జయకార్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు ఎంపీడీవో విజయ్‌కుమార్ మంగళవారం ధ్రువీకరించారు. ప్రస్తుతం బషీరాబాద్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా కొనసాగుతున్న జయకార్‌కు అదనంగా ఇన్‌చార్జి ఎంపీవో బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది.







కదిలిన చెత్త సేకరణ బండ్లు

» నిధుల ఖర్చుపై ఆరా తీసిన చైర్‌పర్సన్

» వెంటనే మరమ్మతులు చేసి రెండు ఆటోలు రిలీజ్

» 'ఎక్కడి చెత్తబండి అక్కడే' కథనంపై చర్చ



మంగళవారం ఆఫీస్‌కు చేరుకున్న టిప్పర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో ఎట్టకేలకు చెత్త సేకరణ బండ్లు రోడ్డెక్కాయి. ఆంధ్రజ్యోతిలో మంగళవారం 'ఎక్కడి చెత్తబండి అక్కడే' అన్న శీర్షికన ప్రచురితమైన కథనంపై తాండూరులో ముమ్మరంగా చర్చ జరిగింది. ఈ విషయమై మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్, కౌన్సిలర్ సంగీత ఠాకూర్, మరికొందరు కౌన్సిలర్లు నిధుల ఖర్చుపై అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం. ఆటోలు, ట్రాక్టర్లు ఎన్నింటికి మరమ్మతులు చేశారు? ఎన్ని నిధులు ఇచ్చారు? నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు చెల్లింపుపై ఇంజనీర్ విభాగం, కమిషనర్‌ను అడిగి వివరాలు సేకరించారు. అధికారులు ఆగమేగల మీద మెకానిక్ వద్ద ఉన్న రెండు ఆటోలు, ఒక టిప్పర్‌కు వెంటనే రిపేరు చేయించి రిలీజ్ చేయించారు. టిప్పర్ మూడు నెలలుగా మెకానిక్ షెడ్‌లోనే ఉండటం గమనార్హం. మరమ్మతులు చేయించడంతో మంగళవారం మున్సిపల్ కార్యాలయానికి చేరింది. తన వార్డులో నాలుగు రోజులుగా చెత్త సేకరణకు సంబంధించిన ఆటో రావడం లేదని ఈ విషయంలో అధికారులను అడిగితే చెత్త సేకరణ వాహనం మరమ్మతులకు గురైందని చెబుతున్నారని కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. అసలు ఆటోలు సక్రమంగా చెత్త సేకరణకు రావడం లేదని ఇంతా నిధులు ఎలా ఖర్చు అయ్యాయని అంటూ కౌన్సిలర్‌లు ఆశ్చర్యపోతున్నారు.



కొనసాగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులు

ట్రా'ఫికర్'!

మేడ్చల్ పట్టణంలో స్తంభిస్తున్న వాహనాలు

- హైవే నిర్మాణ పనులతో కుచించుకుపోయిన రోడ్డు
- రోడ్డు వెడల్పు చేయకుండా కొనసాగిస్తున్న పనులు
- రోడ్డుపై కి.మీ మేర నిలుస్తున్న వాహనాలు
- సమయానికి వెళ్లలేక విద్యార్థులు, ఉద్యోగుల ఆందోళన

మేడ్చల్ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణంలోని జాతీయ రహదారిపై పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెద్ద వాహనాలతో కిక్కిరిస్తున్న రహదారి ఎక్కాలంటే స్థానికులు బెంబేలెత్తుతున్నారు. జాతీయ రహదారి నిర్మాణంతో ప్రారంభమైన సమస్య రోజుకింత పెరుగుతోంది. రోడ్డు నిర్మాణం పనులు ప్రస్తుతం పట్టణంలోకి ప్రవేశించడంతో నత్యం రహదారి వాహనాలతో కిక్కిరిసిపోతోంది. పట్టణంలో రోడ్డు వెడల్పు చేయకుండా ఉన్న కాస్త రోడ్డు మధ్య తవ్వకాలు జరిపి పిల్లర్ల నిర్మాణ పనులు చేపడుతుండటంతో రోడ్డు కుచించుకుపోయింది. దీంతో వాహనాలు ముందుకు

మిగతా 8వ పేజీలో...



వాహనాలతో కిక్కిరిసిన మేడ్చల్ పట్టణంలోని జాతీయ రహదారి



ఘనంగా సదర్ ఉత్సవం

పరిగి,నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పరిగి శ్రీకృష్ణయాదవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సదర్ సమ్మేళనాన్ని నిర్వహించారు. గాంధీచౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం మీదుగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. వేంకటేశ్వర ఆలయంలో దున్నలకు పూజలు నిర్వహించారు. సదర్ ఉత్సవంలో పొట్టేళ్లు, దున్నపోతుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంఘం నాయకులు కొల్లూరి వెంకటేశ్, మల్లేశ్, రాముయాదవ్, బందెయ్య పాల్గొన్నారు.



కీసరగుట్టలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తజనం

ఘనంగా రుద్రాభిషేకం



స్వామికి రుద్రాభిషేకం చేస్తున్న అర్చకులు

కీసర, నవంబరు12(ఆంధ్రజ్యోతి): కీసరగుట్ట మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా రామలింగేశ్వర స్వామికి శ్రీ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం గర్భాలయంలోని మూలవిరాట్‌కు నిత్య సేవల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయప్రాకార మండపంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేద్దాం

» దిశ చైర్మన్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులంతా కలిసి పని చేసి వికారాబాద్ జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామని దిశ చైర్మన్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశాన్ని విశ్వేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. దిశ వైస్ చైర్‌పర్సన్ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, కలెక్టర్ ప్రతీక్‌జైన్, చేవెళ్ల, తాండూర్ ఎమ్మెల్యేలు యాదయ్య, మనోహర్ రెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్‌లతో కలిసి వివిధ అంశాలపై సమీక్షించారు. చైర్మన్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు పని చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం వేలాది కోట్ల నిధులు ఇస్తోందని, ప్రభుత్వ నిధులను సక్రమంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. మూడు నెలలకోసారి సమీక్షించుకోవాలన్నారు. పాఠశాలల్లో సదుపాయాలు, స్వచ్ఛభారత్ బాత్‌రూమ్‌ల మరమ్మతులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పర్యాటక అభివృద్ధికి 100కోట్లు మంజూరు చేశామన్నారు. లక్ష్యాల మేరకు రుణాలివ్వాలని బ్యాంకర్లకు సూచించారు. పని చేయని బోర్లను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. అంగన్‌వాడీలన్నింటికీ భవనాలు కట్టించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, చిన్నారులకు బాలామృతం తప్పక ఇవ్వాలని చెప్పారు. పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, ఉపాధి హామీ, విద్యుత్, మిషన్ భగీరథ, హైవేలు, భూగర్భ జలాల అంశాలపై సమీక్షించారు. డీఆర్డీవో శ్రీనివాస్, పరిగి మునిసిపల్ చైర్మన్ అశోక్‌కుమార్, నామినేటెడ్ సభ్యులు వడ్ల నందు, రాజశేఖర్, జానకిరామ్, లలిత, మునిసిపల్ కమిషనర్లు జకీర్ అహ్మద్, వెంకటయ్య, విక్రమసింహారెడ్డి, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బావిలో పడి తల్లీకూతుళ్ల ఆత్మహత్య

పరిగిరూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బావిలో పడి తల్లీకూతురు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన మంగళవారం వికారాబాద్ జిల్లా పరిగి మండలం ఖుదావంద్‌పూర్‌లో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖుదావంద్‌పూర్‌నకు చెందిన లలిత(31)కు 12ఏళ్ల క్రితం చౌడాపూర్‌కు చెందిన ఏసయ్యతో వివాహమైంది. వారికి భవాని(10) అనే కూతరు ఉంది. కొన్నేళ్ల క్రితం ఏసయ్య మృతి చెందడంతో లలిత కూలీ పని చేస్తూ బిడ్డను పోషిస్తోంది. రెండు రోజుల క్రితం చౌడాపూర్ నుంచి ఖుదావంద్‌పూర్ వచ్చింది. ఏమైందో తెలియదు మంగళవారం తల్లీకూతుళ్లు ఇద్దరూ బావిలో శవమై తేలారు. కాగా, ఆర్థిక ఇబ్బందులతోనే ఆమె ఆత్మహత్య చేసుకోవచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పుట్టింటికొచ్చి తల్లీబిడ్డలు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఇదిలా ఉంటే ఈ ఘటనపై తమకు ఫిర్యాదు రాలేదని పరిగి ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

గోశాలకు పశుగ్రాసం వితరణ

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చౌడమ్మగుట్ట అంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఉన్న శ్రీకృష్ణ గోశాలకు స్థానిక స్టీల్, సిమెంట్ డీలర్ ఉప్పల శివకుమార్ ట్రాక్టర్ వరిగడ్డిని దానం చేశారు. షాద్‌నగర్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉప్పల శివకుమార్‌ను వాసవి క్లబ్ నాయకులు గుడుపల్లి వెంకటరమణ, ఎంవీఎస్ సురేష్, కల్వ మాణిక్యం, దండు వాసు, కొండ రమాదేవి, కల్వ పుష్పలత, పి.స్వప్నలు అభినందించారు. పశువులకు మేతను సమకూర్చడం సంతోషకరంగా ఉందన్నారు.



తాండూరులో సర్వేను పరిశీలిస్తున్న మెప్మా పీడీ రవికుమార్ (ఫైల్)

వివరాలు చెప్పేందుకు వెనకడుగు

- ఎన్యూమరేటర్లకు భూములు, ఆస్తుల లెక్కలివ్వని ప్రజలు
- బ్యాంక్ ఖాతా నంబర్లు ఇచ్చేందుకూ జనం భయం
- సమగ్ర కుటుంబ సర్వే తీరూతెన్నిది!

తాండూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కుటుంబ, కుల గణన సర్వేపై చర్చ కొనసాగుతోంది. ఏ నలుగురు కలిసినా మీ ఇంటికి సర్వే ఎన్యూమరేటర్లు వచ్చారా? ఏమేం వివరాలు చెప్పారు? అడిగినవన్నీ చెప్పారా? అని మాట్లాడుకుంటున్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఎన్యుమరేటర్లకు బ్యాంక్ ఖాతా, ఆధార్ నంబర్లు ఇవ్వడం లేదు. మా భూముఃి, ఆస్తుల వివరాలు మీకెందుకు అని తేల్చి చెబుతున్నారు. ఈ నెల 9న ప్రారంభమైన కుల గణన సర్వేపై ప్రజలకింకా స్పష్టత రాలేదు. ఆస్తులు, వాహనాల వివరాలు చెబితే ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయేమోనని, వచ్చేవి రావని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చిరు వ్యాపారులు బ్యాంక్ ఖాతా నంబర్లు చెప్పం అంటున్నారు. ఈ సర్వే ఫలితాలు ఎలా ఉంటాయోనని ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ఈ సర్వే ఈ నెల 18 వరకు కొనసాగనుంది. తాండూరు సబ్‌డివిజన్‌లో 71వేల పైచిలుకు ఇండ్లు ఉన్నాయి. ఉన్నతాధికారులు సర్వేను నిత్యం పర్యవేక్షిస్తూ ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేస్తున్నారు. మూడు రోజుల్లో మంగళవారం వరకు 15శాతం వరకు ఇండ్లలో సర్వే చేశారు. జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో సర్వే కొనసాగుతోంది. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, వైకల్యం శాతం వంటి వివరాలు చెబితే చాలని, జిరాక్స్ కాపీలు అవసరం లేదని అధికారులు ప్రజలకు తెలియజేస్తున్నారు. అలాగే ప్రతీ కుటుంబం సర్వే వివరాలను ప్రభుత్వం గోప్యంగా ఉంచుతుందని పేర్కొంటున్నారు.

దిశ సభ్యుడిగా వడ్ల నందు



వికారాబాద్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సభ్యుడిగా వికారాబాద్ బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్లనందుకు అవకాశం దక్కింది. ఆయనతో పాటు మా శారద ఆసుపత్రి డాక్టర్ రాజశేఖర్, కుల్కచర్ల వాసి జానకి రామ్, తాండూరుకు చెందిన అనంతలక్ష్మిలను సభ్యులుగా నియమించారు.

క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందిస్తాం



బహుమతులు అందజేస్తున్న మునిసిపల్ చైర్మన్ అశోక్

పరిగి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు అన్ని రకాలుగా ప్రోత్సాహాన్ని అందిస్తామని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్, ఎంపికల కార్యక్రమం మంగళవారం ముగిసింది. జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి, పెద్దేముల్, మోమిన్‌పేట్, కొడంగల్ జోన్‌ల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. చివరగా ఫైనల్‌లో తాండూరు, కొడంగల్ జట్లు తలపడగా కొడంగల్ జట్టు విజయం సాధించింది. విజేతలకు చైర్మన్ చేతుల మీదుగా షీల్డ్‌లు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, నర్సింహులు, గోపాల్, మధు, నాయకులు మల్లేశ్, తాహేర్‌అలీ పాల్గొన్నారు.

బషీరాబాద్ మండల వ్యవసాయాధికారిగా అనిత



బషీరాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారిగా ఎన్.అనిత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడా ఏవోగా పని చేసిన సూర్యప్రకాష్ ధారూర్ మండలానికి బదిలీఅయ్యారు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలానికి చెందిన అనిత ఇటీవల కొత్తగా ఉద్యోగంలో చేరగా ఏవోగా ప్రభుత్వం ఇక్కడా నియమించింది. రైతులకు అందుబాటులో ఎంటూ సేవలందిచేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి



బండవెల్కిచర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య

కులకచర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలని సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య అన్నారు. మండలంలోని బండవెల్కిచర్ల, పుట్టపహాడ్ గ్రామాల్లో మంగళవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఈవో బక్కారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, సొసైటీ డైరెక్టర్ కొండయ్యగౌడ్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న వజ్రేష్‌యాదవ్

ఘట్‌కేసర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లోని ఆయన నివాసంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్‌ఎఫ్‌సీ నగర్‌కు చెందిన సాయికుమార్, ఘట్‌కేసర్‌లోని బాలాజీనగర్‌కు చెందిన రాజేందర్‌రెడ్డికి రూ.60వేల చొప్పున మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ, మాజీ సర్పంచ్ వెంకటేష్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సునిల్‌కుమార్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చివరి ధాన్యపు గింజ వరకూ కొంటాం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

యాచారం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి చివరి వడ్ల గింజ వరకూ కొంటామని, కొన్న వారం రోజుల్లో డబ్బు జమ చేస్తామని డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, డీసీసీబీ చైర్మన్ సత్తయ్య అన్నారు. మంగళవారం మంతన్‌గౌరెల్లి, యాచారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. గతంలో సన్న రకం ధాన్యం కొనక రైతులు ఆందోళన చెందారని, ఈ సారి సన్నరకం ధాన్యం కూడా కొని రైతులకు క్వింటాలుపై అదనంగా బోనస్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి, బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, ఏవో రవినాథ్, కె.జోగిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలి



రైతు సదస్సులో మాట్లాడుతున్న డీఏవో నర్సింహారావు

కందుకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతులు సాగులో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి కె.నర్సింహారావు అన్నారు. రైతునేస్తంలో భాగంగా మంగళవారం కొత్తగూడ(కందుకూరు రైతు వేదిక)లో నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. పంట వేసే ముందే లోతైన దుక్కులు చేసుకోవాలన్నారు. పంటలపై చీడ పురుగులు ఆశించకుండా తరచూ మోతాదు మేరకు రసాయన మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. సేంద్రీయ ఎరువుల వినియోగంతో పంట దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో కృష్ణమోహన్, ఏఈవోలు రాజు, జగదీశ్వర్, రాఘవేందర్, శ్రీహరి, నర్మద, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అనంతుడిని దర్శించుకున్న ఎంపీ



ఆలయ ప్రాంగణంలోని చెట్టుకు ముడుపు చెల్లిస్తున్న ఎంపీ అరుణ

వికారాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అనంతగిరిలో కార్తీక మాస పెద్ద జాతర ఘనంగా జరుగుతుండగా మంగళవారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే.అరుణ స్వామి వారిని దర్శించుకున్నారు. ఎంపీతో అర్చకులు పూజలు చేయించి అనంతరం సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఆలయం ప్రాంగణంలో ఉన్న చెట్టుకు ఎంపీ అరుణ ముడుపు చెల్లించారు. అనంతరం ఆలయ పరిరక్షణ సమితి భజన కార్యక్రమాల్లో పాల్గొని కళాకారులను అభినందించారు. రెండో రోజు అనంతగిరి జాతరలో తిరుమల శ్రీనివాసుడి సేవల మాదిరిగా మహిళలు స్వామి సేవలో పాల్గొన్నారు. ధారూర్ మండల మహిళలు భక్తులకు సేవ చేశారు. ఎంపీ వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, లేడీ వింగ్ ప్రెసిడెంట్ యాష్కి, శిరీష, సుచరితారెడ్డి తదితరులున్నారు.

ఐసీఎల్ కర్మాగార కాలుష్యంపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న రైతులు

తాండూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపూర్ గ్రామ శివారులోని ఇండియా సిమెంట్ కర్మాగారం కాలుష్యంతో పంట పొలాలు దెబ్బతింటున్నాయి. దీంతో గ్రామానికి చెందిన కొంత మంది రైతులు ఇండియా సిమెంట్ కర్మాగార ప్రతినిధులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రఘునాథ్‌రెడ్డి, మాజీ ఘని కార్మిక సంఘం డైరెక్టర్ ఉల్లి నర్సింహులుతో పాటు మరికొంత మంది రైతులు కర్మాగారం సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. పంట పొలాలపైకి కాలుష్య కారకాలు రాకుండా నియంత్రించాలని కోరారు. కాలుష్యంతో పంటలు పడటం లేదని ఈ విషయంపై కాలుష్య నియంత్రణ అధికారులకు ఫిర్యాదు చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ కృష్ణంరాజు

యాచారం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు వారి పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకొని చదివిస్తున్నారని, ఉన్నత చదువులు చదివి ఆదర్శంగా నిలవాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు సూచించారు. మంగళవారం కుర్మిద్ద ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసినకార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఉపాధ్యాయులు ఇష్టంతో బోధిస్తున్న విషయం మరవొద్దన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానానికి ఎదిగితే మొదట సంబరపడేది ఉపాధ్యాయులేనని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్సై తేజంరెడ్డి, హెచ్ఎం పాండురంగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి సరికాదు



షాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కుటుంబ సర్వేలో ఉపాధ్యాయులపై సూపర్‌వైజర్లు ఒత్తిడి చేసి, ఇబ్బందులు పెడుతున్నారని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో అపర్ణకు వినతిప్రతం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సర్వేలో ఎన్యుమరేటర్లుగా ఉపాధ్యాయులు ఇప్పటికే ప్రజల వివరాలు సేకరించేందుకు తిప్పలు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో సర్వే నిబంధనలు అంటూ వివిధ రకాలుగా సూపర్‌వైజర్లు ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయులు ఉదయం పాఠశాలకు వచ్చి విద్యార్థులకు పాఠాలు చెప్పి మధ్యాహ్నం నుంచి సర్వే చేస్తున్నారు. అలాంటి వారిపై ఒత్తిడి సరికాదన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు డేవిడ్‌రెడ్డి, కృష్ణ, టీచర్లు నర్సింహులు, రాంచందర్, వెంకటరమణ, పాషా తదితరులు ఉన్నారు.

స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగంపై చర్యలేవి?



- మేడ్చల్ డీఈవో తీరుపై టీచర్ల విమర్శలు
- ధర్నాలకు సిద్ధమవుతున్న ఉపాధ్యాయ సంఘాలు

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యా శాఖలో 2024 జూన్‌లో జరిగిన టీచర్ల బదిలీల్లో స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేశారని ఉపాధ్యాయసంఘాలు పేర్కొంటున్నాయి. అలాంటి ఉపాధ్యాయులపై చర్యలు తీసుకునేందుకు డీఈఓ తాత్సారం చేస్తున్నారని వారు మండిపడుతున్నారు. ఈ విషయమై డీఈఓకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇందులో ఆంతర్యమేమిటని ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. విచారణలో తేలిన తర్వాతా నాలుగు నెలలుగా డీఈఓ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇతర జిల్లాల డీఈఓలు చర్యలు తీసుకున్నా మేడ్చల్ డీఈఓ మాత్రం చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూన్‌లో ప్రభుత్వం స్పౌజ్ బదిలీలకు అనుమతినిచ్చింది. ఆన్‌లైన్‌లో ఆప్షన్‌లు పెట్టుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. జిల్లా ఉపాధ్యాయులు అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ కొందరు నిబంధనలకు విరుద్ధంగా ఆప్షన్లు పెట్టుకున్నారు.



డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

భార్య/భర్త ఉన్న పాఠశాలకు లేదా సమీపంలోని మరేదైనా పాఠశాలకు ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. అయితే కొందరు టీచర్లు తమ నివాసప్రాంతాల సమీప పాఠశాలలకు, హెచ్ఆర్ఏ ఎక్కువొచ్చే ప్రాంతంలోని పాఠశాలలకు ఆప్షన్లు ఇచ్చుకున్నారు. దీంతో తమకు నచ్చిన పాఠశాలలకు బదిలీ చేయించుకున్నారు. దీనిపై విద్యాశాఖ అప్రమత్తమై జిల్లాలో 11 మంది ఉపాధ్యాయులపై ఎంఈఓలతో కమిటీ వేసి విచారణ చేయించింది. ఎంక్వైరీ రిపోర్టును డీఈవోకు అందజేశారు. రిపోర్టు ఆధారంగా సదరు ఉపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్న డీఈవోపై ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తప్పుడు స్పౌజ్‌లపై ఇతర జిల్లాల్లో సస్పెన్షన్ చర్యలు తీసుకోగా మేడ్చల్ జిల్లాలో మాత్రం చర్యలేం తీసుకోవడం లేదని అంటున్నారు. ఇదిలా ఉంటే తప్పుడు స్పౌజ్‌లపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వం డీఈఓలకే అధికారం ఇచ్చింది.

జేఏసీ ఆధ్వర్యంలో 21న ధర్నా

స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 21న జేఏసీగా అన్ని ఉపాధ్యాయ సంఘాలు కలిసి ధర్నా చేస్తాయని సంఘాల నాయకులు తెలిపారు. బదిలీల కౌన్సిలింగ్ నాటికి జిల్లాలో స్పౌజ్ పనిచేయనప్పటికీ ఎడిట్ ఆప్షన్ ఇచ్చినా మార్చుకోకుండా స్పౌజ్ పాయింట్లను వాడుకోవడం నిబంధనలకు వ్యతిరేకం అన్నారు. అర్హులైన టీచర్లకు అన్యాయం జరిగిందన్నారు. దీన్ని సరిచేయాలని మంగళవారం డీఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. విచారణలో ఉపాధ్యాయులు తప్పు చేసినట్లు తేలినా వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నందునే జేఏసీగా ఏర్పడి ఈ నెల 21న ధర్నాకు పిలుపునిస్తున్నామని టీఎస్‌యూటీఎఫ్, ఎస్‌టీయూటీఎస్, టీపీయూఎస్, టీయూటీఎఫ్, టీపీఆర్‌టీయూ, టీపీటీఎఫ్ సంఘాల నాయకులు తెలిపారు.

గౌడ కులస్తుల సంక్షేమానికి తోడ్పాటు



ఎమ్మెల్యే కసిరెడ్డిని సన్మానిస్తున్న పాలకూర్ల రాములు, గీత కార్మికులు, నాయకులు

కడ్తాల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గీత వృత్తి రక్షణ, గౌడ కులస్తుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం అన్నివిధాలా తోడ్పాటునందిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తాటి, ఈత, కర్జూర వనాల పెంపునకు ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. కడ్తాల మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో మంగళవారం కడ్తాల్ మండలం చరికొండ, ముద్విన్, ఆమనగల్లు మండలం శెట్టిపల్లి, మాడ్గుల మండలం నాగిళ్ల గ్రామాల గీత కార్మికులు, గౌడ కులస్తులు సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కసిరెడ్డి మాట్లాడుతూ కల్లును కల్తీచేసి ప్రజల ప్రాణాలకు హాని కలిగిస్తే ప్రభుత్వం ఉపేక్షించబోదని, కఠిన చర్యలు తప్పవని తెలిపారు. విక్రయదారులు ప్రభుత్వ ఎక్సైజ్ నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. అర్హులైన గీత కార్మికులందరికీ ప్రభుత్వ పథకాలతో పాటు ఇళ్లులేని కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. గతంలో లైసెన్స్‌లు లేని కార్మికులకు తాను చొరవ తీసుకొని లైసెన్స్‌లు ఇప్పించడం జరిగిందని ఎమ్మెల్యే గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ గౌడ కులస్తులకు రాజకీయంగా కూడా తగిన అవకాశాలు కల్పిస్తుందని, పదవుల్లో పెద్దపీట వేస్తుందని చెప్పారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, గౌడ సంఘం జిల్లా నాయకులు పాలకుర్ల రాములుగౌడ్, లాల్‌కోట నర్సింహ్మగౌడ్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు శేఖర్‌గౌడ్, గూడూరు భాస్కర్‌రెడ్డి, మాలే మల్లేశ్‌గౌడ్, యాదయ్యగౌడ్, మోత్యనాయక్, పోటేళ్ల యాదయ్య, వెంకటయ్య, యాదయ్య, సుమన్, జంగయ్య, అంజయ్య, జహంగీర్‌బాబా, జహంగీర్ అలీ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు వస్త్ర వ్యాపారి విరాళం



షాద్‌నగర్ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు వస్త్ర వ్యాపారి విరాళం అందించారు. పట్టణంలోని జడ్చర్ల రోడ్డులో ఉన్న సీఎంఆర్ బట్టల దుకాణం యజమాని వెంకటరమణ తమ వంతుగా రూ.1.50 లక్షలు విరాళం అందించారు. ఈ మేరకు షాద్‌నగర్ సంస్థ మేనేజర్ సుధాకర్, కృష్ణకుమార్ మంగళవారం పోలీస్ స్టేషన్‌లో సీఐకి చెక్కును అందించారు. సీఎంఆర్ సంస్థకు పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆధ్యాత్మిక కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



పోమాల్‌పల్లిలో ఆలయాన్ని పరిశీలిస్తున్న సీఐ నరహరి

కేశంపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గుళ్లు, గోపురాలు వంటి ఆధ్యాత్మిక కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కేశంపేట సీఐ నరహరి సూచించారు. కొండారెడ్డిపల్లి, పోమాల్‌పల్లి, పాపిరెడ్డిగూడ, వేముల్‌నర్వ, సంగెం గ్రామాల్లోని ఆలయాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆలయాలపై దుండగుల దాడుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆలయాల వద్ద రక్షణ, నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇప్పుడు పోలీసు విచారణలో సీసీ ఫుటేజీల పాత్ర పెరిగిపోయిందని, నేర పరిశోధనల్లోనూ సీసీ కెమెరాలు ఉపయోగపడుతున్నాయన్నారు. ఎన్నో కేసుల్లో కెమెరాల సాయంతో నేరస్థులను పట్టుకొని జైళ్లకు పంపిన సంఘటనలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మురళీధర్, రమేష్, శీను తదితరులు పాల్గొన్నారు.



మెథడిస్టు జాతరను ప్రారంభిస్తున్న బిషప్ డానియెల్ దంపతులు



ఏసు శిలువ వద్ద ప్రార్థనలు చేస్తున్న బిషప్ దంపతులు

మెథడిస్టు జాతర ప్రారంభం

ధారూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ధారూరు క్రిస్టియన్ మెథడిస్టు జాతర మంగళవారం ప్రారంభమైంది. దోర్నాల్, ధారూరు స్టేషన్ గ్రామాల మధ్య కాగ్నా ఉపనది పక్కన ఈ నెల 17వ తేదీ వరకు జాతర కొనసాగుతుంది. ప్రధాన ద్వారం వద్ద బిషప్ ఎంఏ.డానియెల్ దంపతులు రిబ్బన్ కట్‌చేసి జాతరను ప్రారంభించారు. ఏసు శిలువ వద్ద బిషప్ దంపతులు ప్రార్థనలు చేశారు. కొవ్వొత్తులు వెలిగించారు. బిషప్ దంపతులకు జాతర కమిటీ ఘన స్వాగతం పలికింది. బిషప్ డానియెల్ భక్తులకు క్రీస్తు శాంతి సందేశాన్ని వినిపించారు. ప్రభువు ఆశీర్వాదంతో ప్రజలంతా సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో జాతర కమిటీ మెంబర్లు దయానంద్, స్టీవెన్, పాస్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

భక్తులు అడవిలోకి ప్రవేశించొద్దు : రేంజర్

మెథడిస్టు జాతర ప్రాంగణం చుట్టుపక్కల ఉన్న అటవీ ప్రాంతంలోకి భక్తులు ప్రవేశించొద్దని ధారూరు అటవీ రేంజర్ రాజేందర్ తెలిపారు. భక్తులు వంటకు అడవిలో చెట్లు నరికి కలప, పొరక తీసుకుపోవద్దన్నారు. అటవీ ప్రాంతంలో మద్యపానం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడవిలో ప్లాస్టిక్ వ్యర్థాలు పడేసి కలుషితం చేయొద్దని, అటవీ సంరక్షణకు ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రజాసేవకు పదవులు దోహదం

శంషాబాద్ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన గుత్తా అమిత్‌రెడ్డిని శంషాబాద్ మున్సిపాలిటీ కొత్వాల్‌గూడకు చెందిన సీనియర్ నాయకులు గుంటి ప్రవీణ్‌కుమార్, పాత్రికేయులు మధు, నాయకుడు మహ్మద్ నజీరుద్దీన్ మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నజీరుద్దీన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమిత్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా నియమించడం సంతోషకరం అన్నారు. ప్రజాసేవలో యువకులు ఉత్సాహంగా పాల్గొనేందుకు ఇలాంటి పదవులు దోహదపడతాయన్నారు. యువతను గుర్తించి రాజకీయాల్లో ప్రోత్సహించడం అభినందనీయం అని అన్నారు. మరో నాయకుడు ప్రవీణ్ మాట్లాడుతూ ప్రభుత్వం యువకులకు ప్రభుత్వ రంగ కార్పొరేషన్ చైర్మన్ పదవులను కేటాయించడం హర్షణీయం అన్నారు. ఈ సందర్భంగా నాయకులు అమిత్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.



డెయిరీ కార్పొరేషన్ చైర్మన్ అమిత్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

కడా చైర్మన్‌ను పరామర్శించిన సునీతారెడ్డి



కడా చైర్మన్ వెంకట్‌రెడ్డిని పరామర్శిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

వికారాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) చైర్మన్ వెంకట్‌రెడ్డికి సోమవారం లగచర్లలో జరిగిన సంఘటనలో గాయాలయ్యాయి. మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి పరామర్శించారు. వెంకట్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై తెలుసుకున్నారు. అధికారులపై దాడిని తాము ఖండిస్తున్నామన్నారు.

ఇంటింటి సర్వేలో 21 రకాల దివ్యాంగులను గుర్తించాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

షాద్‌నగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేస్తున్న ఇంటింటి సర్వేలో 21 రకాల దివ్యాంగులను గుర్తించాలని వికలాంగుల జాతీయ హక్కుల వేదిక డిమాండ్ చేసింది. మంగళవారం షాద్‌నగర్ ఆర్డీవో సరితకు వినతిపత్రం ఇచ్చారు. ఎన్‌పీఆర్‌డీ డివిజన్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. సర్వేలో పార్ట్1 ఫారం, 13వ కాలంలో మీరు వికలాంగులా? అన్న ప్రశ్న ఉంది. కానీ 2016 వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం 21 రకాల వైకల్యాలను నిర్ధారించారని తెలిపారు. 13వ కాలంలో వికలాంగుల వివరాలను పొందుపర్చలేదన్నారు. 21 రకాల వైకల్యాలను గుర్తించేలా హ్యాండ్‌బుక్‌ను రూపొందించాలని కోరారు.

బీసీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన అశోక్



శ్రీకాంత్‌గౌడ్‌తో అశోక్

కడ్తాల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌ను మంగళవారం ఎస్సీ సెల్ కడ్తాల మండలాధ్యక్షుడు పోతుగంటి అశోక్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు హైదరాబాద్‌లోని కార్యాలయంలో కలిసి పూలమాలలు, శాలువాలతో ఆయనను సత్కరించారు. బీసీల సంక్షేమం, యువత ఉపాధి కల్పనకు కార్పొరేషన్ ద్వారా తోడ్పాటునందించాలని శ్రీకాంత్ గౌడ్‌ను కోరగా సానుకూలంగా స్పందించినట్లు అశోక్ తెలిపారు.

నిరసన జ్వాల

(5వ పేజీ తరువాయి)

సిబ్బంది తమ మద్దతు తెలిపారు. బషీరాబాద్ రెవెన్యూ కార్యాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తహసీల్దార్ వై.వెంకటేష్, ఆర్ఐ నాగార్జునరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశం, సర్వేయర్ రవి పాల్గొన్నారు. అలాగే ఎంపీడీవో విజయ్‌కుమార్, సిబ్బంది మండల పరిషత్ వద్ద ఆందోళన చేశారు. మహేశ్వరం మండల పరిషత్ వద్ద అధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పరిగి మునిసిపల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. కమిషనర్ వెంకటయ్య, నరేష్, దశరథం పాల్గొన్నారు. అలాగే ఇబ్రహీంపట్నం రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ అనితారెడ్డి, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. డీటీ శ్రీనివాస్, ఆర్ఐలు కృష్ణ, పుష్పలత పాల్గొన్నారు. లగచర్లలో దాడిని ఖండిస్తూ మేడ్చల్ కలెక్టరేట్ వద్ద అధికారులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, అధికారులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు, ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరారు. యాలాల రెవెన్యూ ఆఫీసుకు తాళం వేసి అధికారులు, సిబ్బంది విధులు బహిష్కరించారు. పూడూరులో అధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.



హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి వద్ద అడిషనల్ ఎస్పీ రవి

పోలీసుల తనిఖీలు ముమ్మరం

పూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): లగచర్లలో సోమవారం అధికారులపై జరిగిన సంఘటన దృష్ట్యా మంగళవారం మండల పరిధిలోని చెన్‌గోముల్ పోలీసు స్టేషన్ వద్ద హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ఎస్ఐ మధుసూదనరెడ్డి సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. రైతులు, అధికారుల మధ్య జరిగిన ఘర్షణ దృష్ట్యా సమాచారంతో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ స్పీకర్ మధుసూధనాచారి, మాజీ ఎమ్మెల్యేలు నరేందర్‌రెడ్డి, మెతుకు ఆనందం, మహేష్‌రెడ్డి, శుభప్రద్ పటేల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి లగచర్లకు వస్తున్నరన్న సమాచారంతో బారికేడ్లు వేసి వారిని అడ్డుకున్నారు. అనంతరం వారిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి తిరిగి హైదరాబాద్‌కు తరలించారు.

విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలి



కేజీబీవీలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి

ధారూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కేజీబీవీలో చదువుతున్న విద్యార్థినులకు పరిశుభ్రతను పాటిస్తూ నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆయన కేజీబీవీని మంగళవారం సందర్శించి భోజనశాలను, వండిన భోజనాన్ని ఆయన పరిశీలించారు. భోజనం వండే విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పదోతరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేలా బోధన ప్రణాళిక తయారు చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలు పెంచేవిధంగా చొరవ తీసుకోవాలన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరయ్యేనా?

- తాండూరులో స్థల సేకరణ పూర్తి
- ప్రభుత్వానికి చేరిన ప్రతిపాదనలు
- రేపు రెండో విడత ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరుకు శ్రీకారం



తాండూరులో అధికారులు సేకరించిన స్థలం

తాండూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం ప్రతీ నియోజకవర్గంలో 20-25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నాం. ఈనెల 14న(రేపు) రెండో విడుతగా బాలల దినోత్సవం రోజున మరికొన్ని నియోజకవర్గాలకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసి వచ్చే విద్యా సంవత్సరానికి పూర్తి చేస్తాం' అని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. సీఎం హామీతో తాండూరు నియోజకవర్గం విద్యార్థుల్లో ఆశలు చిగురించాయి. జిల్లాకు ఒకటి చొప్పున మంజూరు చేసిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మొదటి విడతగా కొడంగల్ నియోజకవర్గానికి మంజూరుచేయగా అక్కడ భూమిపూజ కార్యక్రమం పూర్తయింది. యాలాల మండలం దౌలాపూర్ వద్ద ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు కోసం 25 ఎకరాల స్థలాన్ని గుర్తించిన అధికారులు మొదటి విడతలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించారు. అయితే తాండూరు పక్కనే ఉన్న కొడంగల్ నియోజకవర్గానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తుండటంతో మొదటి దశలోనే కొడంగల్‌కు కేటాయించినట్లు తెలుస్తోంది. జిల్లాలోని ఇతర ప్రాంతాల ప్రతిపాదనలు పెండింగ్‌లో పెట్టారు. ప్రస్తుతం తిరిగి రెండో దశలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో తాండూరులో తిరిగి ఆశలు చిగురించాయి. జిల్లాలో మిగతా నియోజకవర్గాల కంటే తాండూరు నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉంది. రెండో దశలోనైనా తాండూరుకు అవకాశం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఇప్పటికే తాండూరు ప్రాంతం వెనుకబడి ఉన్నందున ఎలాంటి ఉన్నత విద్యా సంస్థలు లేవని తాండూరుకు వెంటనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మంజూరు చేయాలని కోరారు. కొడంగల్ తనకు మొదటి కన్ను అయితే తాండూరు రెండో కన్ను అంటూ అప్పట్లోనే రేవంత్‌రెడ్డి తాండూరు ప్రజలకు మాట ఇచ్చినందున కొడంగల్‌తో సమానంగా అభివృద్ధికి నిధులు ఇవ్వడంతో పాటు వివిధ రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేయాలని కోరుతున్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



మృతురాలు దేవర్ల వీరేశ్వరి

కీసర రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం మదనాపూర్ గ్రామానికి చెందిన దేవర్ల వీరేశ్వరి(23) తన భర్తతో గొడవపడి నగరానికి వచ్చేసింది. పొట్ట కూటి కోసం తెలిసిన వ్యక్తితో కలిసి కీసర టౌన్‌లోని ఓ సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీలో పనిచేస్తోంది. మంగళవారం సిమెంట్ బస్తా ఎత్తుకెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడింది. దీంతో ఆమె తలకు గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన తోటి పనివారు చికిత్స నిమిత్తం ఆమెను ఆస్పత్రికి తరలించారు. అక్కడికి వెళ్లే సరికి అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి..

శంషాబాద్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన శంషాబాద్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం రాత్రి పెద్దషాపూర్ గ్రామ పరిధిలో గల ఎన్‌హెచ్ 44 రోడ్డుపై శంషాబాద్ వైపు వెళ్లే దారిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న శంషాబాద్ పెట్రోలింగ్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తి (50-55), ప్రమాదంలో శరీరంపై తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. మృతుడు పెద్ద షాపూర్ గ్రామ పరిధిలో రోడ్డు దాటుతుండగా షాద్‌నగర్ వైపు నుంచి వస్తున్న కారు ఢీకొట్టడంతో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి ఒంటిపై ముదురు నీలిరంగు షర్టుతో పాటు తెల్లటి గడ్డం, తల వెంట్రుకలున్నాయి. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. వివరాలు తెలిసినవారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

కారు బోల్తా.. నలుగురికి గాయాలు

మూడుచింతలపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్కపట్ల కంపెనీల నుంచి నలుగురు వ్యక్తులు కారులో జగ్గంగూడ-బొమ్మరాశిపేట్ రోడ్డులో వస్తున్నారు. ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి కల్వర్టు దగ్గర ముందు టైర్ రాయి పైకి ఎక్కడంతో అదుపుతప్పి కల్వర్టు కిందికి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తులను చికిత్స నిమిత్తం ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గాయాలపాలైన వారి వివరాలు తెలియాల్సి ఉంది.

వేర్వేరు చోట్ల రేషన్ బియ్యం పట్టివేత

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. అవుషాపూర్‌కు చెందిన దరావత్ రమేష్(28) గ్రామంలో రూ.10కు రేషన్ బియ్యం కొనుగోలు చేసి సంగారెడ్డిలోని పౌల్ట్రీఫారంలోని కూలీలకు రూ.15లకు విక్రయిస్తుంటాడు. మంగళవారం ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా అవుషాపూర్‌లో పోలీసులు పట్టుకుని రేషన్ బియ్యాఇన్న స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఎదులాబాద్‌లో యాదాద్రి జిల్లా, తుర్కపల్లి, పొట్టిమేరి తండాకు చెందిన నిఖిల్ నాయక్ స్థానికుల నుంచి రేషన్‌బియ్యం కొనుగోలు చేసి గంగపుత్ర కాలనీలోని ఓ నిర్మానుష్య ప్రదేశంలో నిల్వ చేశాడు. అక్కడి నుంచి 15క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని గొల్కొండకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తిపై కర్రలతో దాడికి యత్నం

- చంపేస్తామంటూ బెదిరింపులు
- 20మందిపై బాధితుడి ఫిర్యాదు

ఘట్‌కేసర్ రూరల్, రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): భూమి విషయంతో తనను చంపేస్తామంటూ కొందరు తనపై కర్రలతో దాడికి యత్నించారని వెంకటాపూర్ గ్రామానికి చెందిన బుర్ర వెంకటేష్ మంగళవారం రాత్రి పోచారం ఐటీ కారిడార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. కొర్రెముల రెవెన్యూ పరిధి, సర్వే నెంబర్ 174లోని 12ఎకరాల ప్రభుత్వభూమి తప్పుడుపత్రాలు సృష్టించి పట్టాదారు పాసుపుస్తకాలు పొందారని ఈనెల 8న ఆంధ్రజ్యోతిలో 'అమ్మోయ్ అన్ని దాందాలా?' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ గౌతంపోట్రు స్పందించిన విషయం తెలిసిందే. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి 12ఎకరాల ప్రభుత్వభూమి కాజేసిన వెంకటాపూర్ మాజీ ఎంపీటీసీ నీరుడు రామారావు అతడి కుటుంబసభ్యుల పట్టాదారు పాసుపుస్తకాలను కలెక్టర్ రద్దుచేసి, తిరిగి ప్రభుత్వభూమిగా చేర్చారు. వారి భూమి పోవడానికి బుర్ర వెంకటేశ్ కారణమని మనసులో పెట్టుకున్న నీరుడి రామారావు, అతడి కుటుంబసభ్యులు 20మంది సోమవారం రాత్రి కర్రలతో దాడి చేయడానికి యత్నించారని వెంకటేశ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి నుంచి నాకు ప్రాణహాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని పోలీసులను వేడుకున్నాడు.

కొర్రతండాలో కిరాణషాపు దగ్ధం

మాడ్గుల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్రతండాలో ఓ కిరాణషాపు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. మంగళవారం ఉదయం కొర్ర సేవ్యా తన షాపులో వస్తువులను విక్రయించి మధ్యాహ్నం వ్యవసాయ పొలానికి వెళ్లాడు. సాయంత్రం షాపులో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఫర్నిచర్, ఫ్రిడ్జ్, ఇతర సామగ్రి కాలి బూడిదైనట్లు బాధితుడు తెలిపాడు. దాదాపు రూ.లక్షా 50వేల నష్టం వాటిల్లినట్లు సేవ్యా తెలిపాడు. కాగా, ప్రభుత్వం బాధితుడిని ఆర్థికంగా ఆదుకోవాలని మండల గిరిజన నాయకుడు కొర్ర బాల్‌నాయక్ కోరారు.

కలెక్టర్‌పై దాడి బీఆర్‌ఎస్ నాయకుల కుట్రే



మర్పల్లి: మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



కులకచర్ల: సమావేశంలో మాట్లాడుతున్న మొగులయ్య

పరిగి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): లగచర్లలో కలెక్టర్‌పై దాడి బీఆర్‌ఎస్ నాయకుల కుట్రేనని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫార్మా కంపెనీ ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన అధికారులపై పక్కా ప్రణాళికతో దాడులకు దిగారని తెలిపారు. బాధ్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. కలెక్టర్‌పై దాడి జరగడం బాధాకరమన్నారు. ఉద్దేశపూర్వకంగా ఈఘటనకు పాల్పడిన వారికి చట్టపరంగా వదిలే ప్రసక్తిలేదన్నారు. ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు భూములు ఇస్తున్న రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు.

ధారూరు: లగచర్లలో అధికారులపై దాడి బీఆర్‌ఎస్ గుండాల పనేనని, ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకర్గాన్ని రూ.5వేల కోట్లతో అభివృద్ధి చేయడాన్ని ఓర్వలేక ఇలాంటి దాడులతో అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కులకచర్ల: ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేయడం హేయమని కులకచర్ల సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్ అన్నారు. లగచర్లలో కలెక్టర్, కడా ప్రత్యేకాధికారిపై జరిగిన దాడిని వారు ఖండించారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వెంకటయ్యగౌడ్, కృష్ణ, జలీల్, రవి, నర్సింహులుగౌడ్ పాల్గొన్నారు.

యాలాల: లగచర్లలో కలెక్టర్‌పై దాడి ముమ్మాటికి ప్రతిపక్షం కుట్రేనని జిల్లా కో-ఆప్షన్ల సంఘం మాజీ అధ్యక్షుడు అక్బర్ బాబా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్ని కుట్రలు, దాడులు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. ఫార్మా కంపెనీల వల్ల స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఆ ప్రాంత మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రతిపక్షం అడ్డుకునే యత్నం చేస్తోందని మండిపడ్డారు.

మర్పల్లి: విధి నిర్వాహణలో ఉన్న అధికారులపై దాడి చేసిన వారిని చట్టరీత్యా శిక్షించాలని మర్పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని దుద్యాల మండలం లగచర్లలో సోమవారం ఫార్మా భూఅభిప్రాయ సేకరణలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తదితర అధికారులపై రైతులు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. రైతుల ముసుగులో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు అభివృద్ధిని అడ్డుకునేందుకు దాడి చేయించారని ఆరోపించారు. దాడికి పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు రాములు యాదవ్, బంటారం మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు గణేశ్, రాచన్న, భరత్ పాల్గొన్నారు.

అధికారులను దాడులను సహించం

ఘట్‌కేసర్ రూరల్: ప్రభుత్వ అధికారులపై దాడి చేస్తే సహించేది లేదని ఘట్‌కేసర్ ఇన్‌చార్జి తహసీల్దార్ రాజేందర్ అన్నారు. వికారాబాద్ కలెక్టర్, రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం ఘట్‌కేసర్ తహసీల్దారు కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులు విధులకు గైర్హాజరు

యాలాల: లగచర్లలో జిల్లా కలెక్టర్, అధికారులపై జరిగిన దాడికి నిరసనగా మంగళవారం యాలాల మండల అధికారులు నిరసన తెలిపారు. తహసీల్దార్ కార్యలయం అధికారులు, సిబ్బంది కార్యాలయానికి తాళం వేసి విధులు బహిష్కరించారు. అనంతరం కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



యాలాల: తహసీల్దార్ కార్యాలయానికి వేసిఉన్న తాళం



ఘట్‌కేసర్: తహసీల్దారు కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

ఓవర్‌లోడ్ టిప్పర్లపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న ఆటో డ్రైవర్లు, స్థానికులు

పెద్దేముల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): క్రషర్ నుంచి డస్టును ఓవర్‌లోడ్ వేసుకుని వెళుతున్న టిప్పర్లతో తిప్పలు తప్పడంలేదని ఆటోయూనియన్ సభ్యులు, గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి సంజీవ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. టిప్పర్లు, టారస్‌లలో వాటిక్యాబిన్‌కంటే ఎత్తులో డస్టును తరలించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రుక్మాపూర్, రేగొండి శివారులో గల క్రషర్ మిషన్ నుంచి డస్టును పెద్ద పెద్ద టిప్పర్లు, టారస్‌లలో డస్టును తరలిస్తున్నారని తెలిపారు. దీంతో మంబాపూర్‌లోని స్పీడ్‌బ్రేకర్ల వద్ద టిప్పర్లలో తరలిస్తున్న డస్టు కిందకు జారుతోందని అన్నారు. వాహనాలు వెళ్లే వేగానికి క్యాబిన్‌కంటే ఎత్తుగా ఉన్న డస్టు గాలికి లేచి ప్రయాణికుల కళ్లలో పడుతోందని వాపోయారు. క్రషర్ యజమానికి చెప్పినా ఆయన వినిపించుకోవడం లేదని, సంబంధిత అధికారులు స్పందించి తమ ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకుని ఓవర్‌లోడ్‌తో వాహనాలు వెల్లకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. లేదంటే తాము ఆందోళనకు సిద్ధమవుతామన్నారు.


1108 తమలపాకులతో అభయాంజనేయ స్వామికి అలంకరణ



పూజల్లో పాల్గొన్న భక్తులు

తాండూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీకదీపోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రెండో రోజు కన్య పాఠశాల ప్రాంగణంలో కార్తీక దీపోత్సవ సంబురాలు కొనసాగాయి. ఈ సందర్భంగా అభయాంజనేయ స్వామి వారికి 1108 తమలపాకులతో మున్యుసూక్త విధానంగా తమలపాకుల పూజ నిర్వహించారు. హనుమాన్ దేవాలయం, బాల హనుమాన్ భజన మండలి, మహిళ భజన మండలిలు సంయుక్తంగా కార్తీక దీపారాదన నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం, మహా మంగళహారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



తాండూరు రూరల్: ఎల్‌వోసీ అందజేస్తున్న చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్, నవంబరు 12: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తాండూరు మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన జగప్ప కుమారుడు అభిరామ్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.44వేల చెక్కును రాష్ట్ర చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వడ్ల మల్లేశం, తదితరులు ఉన్నారు.

ట్రా'ఫికర్'!

(5వ పేజీ తరువాయి)

కదలని పరిస్థితి. ప్రస్తుతం వంతెన నిర్మాణం కోసం 73 పిల్లర్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 62 పిల్లర్లు ఏర్పాటు చేశారు. మిగిలిన 11 పిల్లర్లు పట్టణంలో ఏర్పాటు చేయాల్సి ఉంది.

రోడ్డు విస్తరణ లేకుండా

రోడ్డుకు ఇరువైపుల సర్వీసు రోడ్డును కలుపుకుని అదనంగా మరో 5-7 ఫీట్లను కలుపుకుని ముందుగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోకుండా ఉన్న రోడ్డులోనే పనులు చేపడుతున్నారు. దానికి తోడు ఇరువైపుల ఉన్న సర్వీసు రోడ్డుకు ఆనుకుని చిరు వ్యాపారులు రహదారికి ఆనుకుని పక్కనే తమ వ్యాపారాలను చేసుకుంటున్నారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారి ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతున్నాయి. మేడ్చల్ పెద్ద చెరువు కాలువ నుంచి ఆర్టీసీ కాలనీ వరకు చేరకోవడానికి 45 నిమిషాల సమయం పడుతుందంటే అతిశయోక్తి కాదని వాహనదారులు వాపోతున్నారు.

యూటర్నులతో ఇక్కట్లు

పట్టణంలోని వివేకానంద, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న రెండు యూటర్న్‌ల కారణంగా ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమైంది. పోలీసుల సూచనల మేరకు ఇప్పటికే ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న యూటర్న్‌ను అధికారులు మూసివేసి ప్రత్యామ్నాయంగా ఆర్టీసీ కాలనీ వద్ద ఏర్పాటు చేశారు. కాగా, మేడ్చల్ పట్టణంలోని వివేకానంద చౌరస్తా వద్ద ఉన్న యూటర్న్ మాత్రం అధికారులు మూసివేయ లేదు. దీంతో రహదారికి రెండు వైపుల ఉన్న వాహన దారులు రోడ్డు దాటడానికి ప్రయత్నిస్తుండటంతో అక్కడ వాహనాలు పెద్ద సంఖ్యలో స్థంబించి పోతున్నాయి.

ట్రాఫిక్ సిబ్బందికి సవాల్‌గా..

పట్టణంలోని జాతీయ రహదారిపై విధులు నిర్వహించడం ట్రాఫిక్ పోలీసులకు సవాలుగా మారింది. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పట్టణంలోని రహదారి పై విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులు నిత్యం జామయ్యే ట్రాఫిక్‌ను క్లియర్ చేయలేక తర్జనభర్జన పడుతున్నారు. ఎక్కడ.. ఎప్పుడు... ఎలా... ట్రాఫిక్ జామ్ అవుతుందో అన్న బెంగ నిత్యం ఇక్కడ విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసుల్లో నెలకొంటుంది. వాహనాల మోత...దుమ్ము దూళి...అరుపులు కేకల మధ్య పోలీసులు డ్యూటీ టైమ్ ఎప్పుడు ముగిస్తుందా? అని ఎదురు చూస్తూ విధులు నిర్వహిస్తున్నారు.

యూటర్న్‌లను మూసేస్తాం



ట్రాఫిక్ సమస్యను నియంత్రించే విషయంలో ట్రాఫిక్ సిబ్బంది రాజీ పడకుండా విధులు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని యూటర్న్‌లను మూసివేసి వాటి స్థానంలో కొత్త యూటర్న్‌లు ప్రారంభించే యోచనలో ఉన్నాం. రహదారి పనులు పూర్తయ్యేంత వరకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.

-హనుమాన్ గౌడ్, మేడ్చల్ ట్రాఫిక్ సీఐ

ద్విచక్ర వాహనాల వేలం

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వివిధ మద్యం కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలకు వేలం వేయనున్నట్లు ఘట్‌కేసర్ ఎక్సైజ్ సీఐ జూపల్లి రవి తెలిపారు. నారపల్లిలోని ఘట్‌కేసర్ ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం(నేడు) ఉదయం 11గంటలకు నాలుగు బైక్‌లకు వేలం వేయనున్నట్లు తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి సమక్షంలో వేలం నిర్వహిస్తామని, ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని సూచించారు.

కోటబాస్పల్లిలో మాజీ ఎంపీపీకి ఘన నివాళి



మహిపాల్‌రెడ్డికి సమాది వద్ద నివాళులర్పిస్తున్న నర్సింహారెడ్డి

తాండూరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తాండూరు మాజీ ఎంపీపీ, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తండ్రి గోటిగ మహిపాల్‌రెడ్డి 14వ వర్ధంతిని కోటబాస్పల్లి గ్రామంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు, తాండూరు సిటికేబుల్ ఎండీ, ఇంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ నర్సింహారెడ్డి(బాబు) స్మృతి వనంలో ఆయన సమాధికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తల్లి వెంకటమ్మ సమాధి వద్ద కూడా నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు గోటుగ రాంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, నాగప్ప, కిష్టప్ప, నర్సిరెడ్డి, శేషి కుమార్, వీవీ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి చేయూత



బాధితుడికి నిత్యావసరాలు అందజేస్తున్న చంద్రప్రకాశ్

కులకచర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన బాధితుడికి కులకచర్లకు చెందిన చంద్రప్రకాశ్ అండగా నిలిచారు. మండలంలోని బండవెల్కిచర్లలో సోమవారం విద్యుదాఘాతంతో నర్సింహులుగౌడ్ ఇంట్లోని వస్తువులు కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న కులకచర్లకు చెందిన వస్త్ర దుకాణ వ్యాపారి చంద్రప్రకాశ్ స్పందించారు. తన వంతుగా బాధితుడికి బియ్యం, దుస్తులు, వంట పాత్రలు, ఇతర సామగ్రిని అందించి ఉదారతను చాటుకున్నారు.

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



ప్రశంసపత్రాలతో క్రీడాకారులు, ప్రిన్సిపల్ స్నేహలత, అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహేంద్ర హిల్స్ కళాశాల ప్రిన్సిపాల్ స్నేహలత తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ ఆఫ్ అథ్లెటిక్స్ 2వ చాంపియన్‌షిప్‌ను మహేంద్రహిల్స్ డిగ్రీ కళాశాల కైవసం చేసుకుంది. దీంతో మంగళవారం క్రీడాకారులను ఆమె ప్రశంసా పత్రాలతో అభినందించారు. ఈసందర్భంగా స్నేహలత మాట్లాడుతూ.. క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉందని, చదువులతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. మల్లిక 10, 5 కి.మీ పరుగు పందెంలో బంగారు పతకం, నేరళ్ల అనుషా 10, 5 కి.మీ పరుగుపందెంలో రజత పతకం, నరాల బుచ్చమ్మ షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో బంగారు పతకం సాధించారు. క్రీడాకారులను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, పీడీ బిక్షపతి యాదవ్‌లు అభినందించారు.

అంగన్‌వాడీలకు కిచెన్ ప్లాట్‌ఫామ్స్ మంజూరు



అంగన్‌వాడీ కేంద్రంలో నిర్మించనున్న కిచెన్ ప్లాట్‌ఫామ్(ఫైల్)

బషీరాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు కిచెన్ ప్లాట్‌ఫామ్స్ మంజూరైనట్లు ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు. 17 గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఈ నిధులు మంజూరు చేసిందన్నారు. ఒక్కో కిచెన్ ప్లాట్‌ఫాం నిర్మాణానికి రూ.5వేలు కేటాయించినట్లు తెలిపారు. ఈ పనులకు సంబంధించి చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

నేడు రక్తమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



దౌలాపూర్‌లో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనకు ముస్తాబైన ఆలయం

యాలాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దౌలాపూర్‌లో నేటి(బుధవారం) నుంచి మూడు రోజులపాటు రక్తమైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ వైస్‌చైర్మన్ రాములు, మాజీ సర్పంచ్ లక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు(బుధవారం) ఉదయం 7.21గంటలకు ఆంజనేయ స్వామి ఆలయం నుంచి అమ్మవారి విగ్రహం ఊరేగింపుగా రక్తమైసమ్మ ఆలయానికి చేరుకుంటుందన్నారు. అనంతరం గణపతిపూజ, పుణ్యాహవచనం, గౌరిపూజ, లక్ష్మీపూజ, వాస్తుపూజ, నవగ్రహపూజ, మాతృకపూజ, వాస్తుమండలం, బ్రహ్మాదివాసం, అంకురార్పణం, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ, జలాదివాసం, ధాన్యాదివాసం, శయ్యాదివాసం, వివిధ దేవతల పూజలు తదితర కార్యక్రమాలు జరుగనున్నాయి. 14వ తేదీన ఉదయం 7.25గంటలకు షోడషోపచారపూజలు, హోమాలు, జపాలు, ఉదయం 11.55 గంటలకు విగ్రహాల ప్రతిష్ఠాపన, ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి, 15వ తేదీ ఉదయం 8.55గంటలకు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, మహామంగళ హారతి, బోనాలు తదుపరి తీర్థప్రసాద వితరణ, అన్నదానం కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.